క్లుప్తంగా

మల్లన్నను దర్శించుకున్న కృష్ణదాస్



స్వామివారిని దర్శించుకుంటున్న ధర్మాన కృష్ణదాస్ తదితరులు

టెక్కలి: మండలంలోని రావివలస ఎండల మల్లిఖార్జున స్వామివారిని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఆయన సతీమణి పద్మప్రియ తదితరులు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సాంప్రదాయంగా స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మల్లన్న చిత్రపటాన్ని అందజేశారు. ఆయనతో పాటు మాజీ ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.సుధాకర్, నాయకులు సత్తారు సత్యం, తమ్మన్నగారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయండి



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో వందేళ్ల చరిత్ర కలిగిన మందస రైల్వేస్టేషన్‌లో అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ, ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేయడం లేదని స్థానిక అభివృద్ధి కమిటీ ఆరోపిస్తూ డీఆర్‌ఎం హరిభజన్‌సింగ్ భర్వాల్‌కు వినతిపత్రం అందించారు. రైల్వే అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మంగళవారం ఖుర్దా రోడ్ రైల్వే కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యలు విన్నవించారు. అనంతరం డీసీఎం సునీల్‌కుమార్, డీవో ఏండీఎంలకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కూటమి ప్రతినిధులు కొత్త అనందరావు, శర్మ నరావు, ఎ.రామారావు, సిపాన నరసింహ రాజు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



భూమిపూజ నిర్వహిస్తున్న సర్పంచ్ జోగారావు

సోంపేట: మండలంలోని సర్పంచ్‌లు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులు సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో సీసీ రహదారులు నిర్మించుకుని, గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు పిలుపునిచ్చారు. పలాసపురం పంచాయతీ, లక్కవరం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మాణం చేపడుతున్న సీసీ రహదారికి మంగళవారం భూమి పూజ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ మీసాల చిన్నంనాయుడు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీటితో పాటు రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్నంనాయుడు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై నిఘా పెంచండి



తనిఖీలు చేపడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ: సారా, బెల్టు షాపులపై నిఘా పెంచాలని శ్రీకాకుళం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి పలాస ఎక్సైజ్ శాఖ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కాశీబుగ్గ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలన చేశారు. బెల్టు షాపులను పూర్తిగా నిర్మూలించి, ఎంఆర్‌పీ ధరలకే మద్యం అమ్మేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు నవంబర్ 1వ తేదీ నుంచి పలాస ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని బెల్టుషాపుల నిర్వాహకులపై 12 కేసులు నమోదు చేశామని, అదేవిధంగా నాటు సారా అమ్ముతున్న మరొక వ్యక్తిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేశామని తెలిపారు.

పల్లెకు రాని వెలుగు..!

- పలు గ్రామాలకు నడవని బస్సులు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



స్కూల్‌కు నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దివానిపాలేం విద్యార్థినులు

కవిటి: గ్రామీణ ప్రాంత ప్రజల రవాణా సౌకర్యానికి పెద్ద దిక్కుగా ఉన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ ఆర్టీసీ) పల్లె వెలుగు బస్సులు కవిటి మండల ప్రజలకు అందని ద్రాక్షగా మారాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. కవిటి మండలంలో 23 పంచాయతీలు 122 హేబిటేషన్ గ్రామాల్లో 75,806 మంది నివసిస్తున్నారు. ప్రధానంగా మండలంలో సోంపేట-కవిటి-ఈదుపురం(స్టేట్‌హైవే) ప్రధాన రహదారిని కలుపుతూ మూడు మండలాల ప్రజలను అనుసంధానిస్తూ సుదీర్ఘ రోడ్డు మార్గం ఉంది. కవిటి-కొజ్జిరియా, లోళ్లపుట్టుగ జంక్షన్-ఆదివారం సంత(మఖరాంపురం)రోడ్డు, శిలగాం-జగతి హనుమాన్ జంక్షన్, కవిటి- కపాసుకుద్ధి-నెలవంక-ఈదుపురం మార్గాల్లో ప్రధాన రోడ్లు ఉన్నాయి. అయితే వీటిలో సోంపేట- కవిటి- రాజపురం-ఇచ్ఛాపురం రూటులో మూడు ఏపీఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. అయితే ఇక్కడ ఇతర ప్రాంతాల్లో ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు వస్తే కవిటి మండలానికి కేటాయించిన బస్సులను సర్దుబాటు కింద వేరో ప్రాంతానికి ఎటువంటి ముందస్తు సూచనలు లేకుండానే ఆపేస్తారు.

అక్కరకు రాని వేళలో...

ఇక కవిటి మండలానికి విశాఖపట్నం డిపో ఎక్స్‌ప్రెస్ సర్వీసు మమ అనిపించేలా అక్కరకు రానివేళలో నడుపుతున్నారని బాహాటంగానే ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రధానంగా బొరివంక ఉన్నత పాఠశాల, ఇద్దివానిపాలేం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బడిబస్సు నడుపుతున్నారు. ఈ సర్వీసును కూడా కవిటి మండలానికి కేటాయించిన షటిల్ సర్వీసులోనే సర్దుబాటు చేశారు. దీంతో కవిటి మండలంలో మాణిక్యపురం, ఆర్ బెలగాం, శిలగాం, నెలవంక, ఇద్దివానిపాలెం, పెద్దకర్రివానిపాలెం, కపాసుకుద్ధి తదితర గ్రామాల నుంచి రాజపురంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌కు వెళ్లేందుకు సకాలంలో బస్సులు లేక బాలబాలికలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలుమార్లు పలాస డిపో అధికారులకు చెప్పినా ప్రయోజనం శూన్యం. ఇక కవిటి మండలం నుంచి కంచిలి, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్లకు ప్రయాణికులు వెళ్లాలంటే అధిక ధరలు వెచ్చించి ఆటోలు బుక్ చేసుకుని వెళ్లాల్సిందే. పలాస డిపో అధికారులు కుర్చీలు దిగి క్షేత్రస్థాయికి వచ్చి పరిస్థితి బేరీజు వేయరు. ప్రజల బాధలు పట్టించుకోరు అన్న విమర్శలు తారాస్థాయిలో వినిపిస్తున్నాయి. పోనీ కవిటి మండల పరిషత్ జనరల్ బాడీ మీటింగ్‌లకైనా వస్తారంటే అదీ కూడా లేదు. అసలే కిడ్నీ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్న పరిస్థితుల్లో కవిటి మండలానికి ఆర్టీసీ సేవల అంశంలో అధికారులు ఇంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.



రాజపురం ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు

తీర ప్రాంతాలకు సర్వీసులు లేవు



కవిటి మండలంలోని కపాసుకుద్ధి, కొత్తపాలేం, బట్టివానిపాలేం, చిన్నకర్రివానిపాలేం, పెద్దకర్రివానిపాలేం, ఇద్దివానిపాలేం, ఒంటూరు తీరప్రాంత మత్స్యకార గ్రామాల ప్రజలకు ఆర్టీసీ సర్వీసులు అందుబాటులో లేవు. ఉన్నతాధికారులు ఈ గ్రామాలకు చక్కని రోడ్డు సదుపాయం ఉన్న నేపథ్యంలో ఆర్టీసీ సర్వీసులు నడిపి అల్పాదాయవర్గాలమైన మా మత్స్యకారులకు న్యాయం చేయాలి.

– ఎరుపల్లి రామయ్య, ఎంపీటీసీ సభ్యుడు, బొరివంక-2, కవిటి మండలం

బడిబస్సు నడపాలి



మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బాలబాలికలమంతా రాజపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్నాము. కానీ మేమంతా ఆటోలను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది. కేవలం కొద్దిమంది పిల్లలకు ఉదయం 7 గంటలకు స్కూల్‌లో దింపేసేవిధంగా బస్సు వేళలు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. విద్యార్థులందరికీ ఈ బడిబస్సు సేవలు అందించేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బి.సంతోషి, ఏపీ మోడల్ స్కూల్, రాజపురం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్ అన్నారు. సంకల్పం పేరిట బెన్నుగానిపేట గ్రామంలో స్థానికులతో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్ వచ్చి వ్యక్తిగత సమాచారం అడిగితే ఇవ్వరాదని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడరాదని హెచ్చరించారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినా, వారిని గృహహింసకు గురిచేసినా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సోంపేట: ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పాలవలస ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావు అన్నారు. పాఠశాల ఆవరణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయడానికి ఆకుకూరల విత్తనాలు, దుంప జాతి కాయగూరల మొక్కలు మంగళవారం నాటారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా ఆరోగ్యకరమైన పంటలు సాగు చేయడం జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మద్దిలి చిట్టిబాబు, కుమారి, సంజీవరావు తదితరులు విద్యార్థులకు వివరించారు. ఐసీఆర్పీలు ప్రమీల, తేజ, ఢిల్లేశ్వరి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నారాయణస్వామి

సంతబొమ్మాళి: నేరాల నియంత్రణకు అప్రమత్తత అవసరమని నౌపడ ఎస్‌ఐ జి.నారాయణస్వామి అన్నారు. మండలంలోని యామలపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రలోభాలు, మోసాల బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అత్యవసర సమయాల్లో పోలీసులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గార విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెత్తంతో బాదేశారు..!



ఉపాధ్యాయులు కొట్టడంతో కాలిపై గాయాన్ని చూపుతున్న విద్యార్థి

కోటబొమ్మాళి: మండలంలోని దంత గ్రామ ఎంపీయూపీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు అదే పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులను బెత్తంతో కొట్టి గాయపరిచినట్లు తెలిసింది. ఈ ఘటనపై బాధితుల తల్లిదండ్రులు మీడియాను ఆశ్రయించారు.

రూ.50 వేల విరాళం అందజేత

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో వెలసిన కంచమ్మతల్లి అమ్మవారికి ఆలయ అభివృద్ధి కమిటీ చేయించదలచిన బంగారు జటపాళి కోసం కంచిలికి చెందిన కొత్తకోట వైకుంఠరావు, మమత దంపతులు రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులకు మంగళవారం ఆలయం ఆవరణలో గ్రామస్తుల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లండ లక్ష్మి, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రపంచంలో భారత రాజ్యాంగం ఎంతో ఆదర్శవంతమైందని పలువురు వక్తలు కొనియాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా మంగళవారం నిర్వహించారు. అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు హాజరై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగం విశిష్టత, గొప్పతనాన్ని గుర్తు చేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కోటబొమ్మాళి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కాశీబుగ్గ: కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి



పలాస: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



టెక్కలి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కవిటి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



సంతబొమ్మాళి: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కంచిలి: అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు



ఇచ్ఛాపురం: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: కె.శాసనాం హైస్కూల్లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ బోర పుష్ప తదితరులు



సోంపేట: రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వజ్రపుకొత్తూరు: ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో రమేష్‌నాయుడు తదితరులు

దుర్గంధ భరితం



శ్రీకాకుళం జిల్లాలో అతిపెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవులో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. దీంతో మత్స్యకారులు అనేక అవస్థలు పడుతున్నారు. గ్రామంలో పలు కూడళ్లు, పాఠశాలలు, వీధులు, రోడ్లులతో పాటు చేపలు నిల్వ పెట్టే ప్రాంతం, చేపలు ఎండపెట్టే ప్లాట్‌ఫారాం వద్ద చెత్త చెదారంతో మురికినీరు చేరి అధ్వానంగా మారి దుర్గంధమై వాసన వెదజల్లుతోంది. దీంతో అనారోగ్యానికి గురై అస్పత్రి పాలవుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు. – వజ్రపుకొత్తూరు రూరల్

కంటి వైద్య పరీక్షలు



పలాస ప్రశాంతి సాయి మందిరంలో మంగళవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య చికిత్స శిబిరం జరిగింది. దీనిలో భాగంగా 69 మంది హాజరుకాగా, 40 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వారిని విశాఖపట్నంలో ఆపరేషన్‌కి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, కన్వీనర్ జగదీష్, కొంతేయుడు, కామేశ్వరరావు, కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు. – కాశీబుగ్గ

బీల ఆనంద హేల



ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి అందుతున్న వేళ అన్నదాతల మోములో ఆనందం తొణికిసలాడుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ వరిపంట ఎన్నో ఆటుపోట్లు అధిగమించి బాగా పండింది. మరో వారం రోజుల్లో బీల ప్రాంతంలోని 2500 ఎకరాల్లో వరిపైరు చేతికందబోతోంది. ప్రస్తుతం ఎటు చూసినా బీలప్రాంతంలో వరిపైరు బంగారువర్ణంలో కళకళలాడుతోంది. అయితే ప్రస్తుతం వాతావరణం కలవరపెట్టిస్తోంది. – కవిటి

అన్నదాతకు వాయు‘గండం’

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో అన్నదాతల గుండెల్లో అందోళన నెలకొంది. పొలాల్లో పంట చేతికి అందివచ్చే సమయంలో ఈ విధంగా తుఫాన్ ప్రభావం ఉండడంతో కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పంటను కోసి వాటిని కుప్పలుగా పెట్టేందుకు పొలాల్లోనే రోజంతా ఉంటున్నారు. ఈ సమయంలో వర్షం వస్తే పూర్తిగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



టెక్కలి రూరల్: పంటను మోసుకెళ్తున్న దృశ్యం



టెక్కలి రూరల్: పొలంలోనే కుప్పలుగా వేసుకున్న వరిచేను



పలాస: వరిచేను కుప్ప వేస్తున్న రైతు



టెక్కలి: పంట పొలాల్లో కోత కోసిన వరిచేను తరలిస్తున్న రైతులు



వజ్రపుకొత్తూరు రూరల్: వరి కోతలు చేస్తున్న మహిళలు



టెక్కలి: వరి చేను కుప్పలుగా వేస్తున్న రైతులు



వజ్రపుకొత్తూరు రూరల్: వరి కుప్ప వేస్తున్న రైతులు



వజ్రపుకొత్తూరు: బెండిలో కోసిన వరి చేనును కుప్పగా పెడుతున్న రైతులు



వజ్రపుకొత్తూరు: పూండిలో వరి ఓవులను కాపాడుకునే పనిలో రైతులు



వజ్రపుకొత్తూరు: అల్లకల్లోలంగా ఉన్న అక్కుపల్లి సముద్ర తీరం

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నిర్మాణాలు పరిశీలిస్తున్న ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు

కంచిలి: సీతంపేట ఐటీడీఏ ద్వారా చేపడుతున్న మల్టీపర్పస్ కేంద్రాల భవన నిర్మాణ పనుల్లో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. మండలంలోని నువాగడ గ్రామంలో ఐటీడీఏ నిధులతో మంజూరై నిర్మాణంలో ఉన్నటువంటి మల్టీపర్పస్ కేంద్ర భవన నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి, జనవరి చివరి నాటికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

పాఠశాల పరిసరాలు పరిశీలన

ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీవో జి.చిన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని నువాగడ గ్రామంలో గిరిజన ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల తరగతి గదులు, భోజన శాల పరిశుభ్రంగా ఉంచాలన్నారు. స్టోర్‌రూమ్‌లో సరుకులను పరిశీలించి, నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. భోజనం రుచికరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ఆయనతో పాటు పాఠశాల హెచ్‌ఎం దుర్గాప్రసాద్ పాడి, ఏఈ వంగపండు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

సోంపేట: సీతంపేట ఐటీడీఏ ద్వారా మంజూరైన మల్టీపర్పస్ సెంటర్ల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఏపీవో చిన్నబాబు అన్నారు. మండలంలోని ఎంజీపురం పంచాయతీ గిరిజన గ్రామాల్లో నిర్మాణం చేపడుతున్న భవనాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను సూచించారు.